# మాటవరస 3

భమిడిపాటి కామేశ్వరరావుగారు, బి. ఏ.

[24-1-31 తేదీని, రాజమండ్రీ ఆర్ట్సుకాలేజీలో, పాతవిద్యార్థిసంఘంతరఫున జరిగిన సాంవత్సరిక సమావేశ సందర్భంలో, ఈముక్కలు పూర్తిగా చదవడానికి నాకు వీల్లేకొచ్చినా, చదివినంతపనీ జరిగింది. అదో పెద్ద గాథ.]

1. బలరామయ్యగారి ఇంగ్లీషుతమ్ముడు.

వెనక, మాఅందరికి మల్లేనే మా తమ్ముడుకూడా పెద్దబాలశిక్ష పట్టి, పలకా బదరా పుచ్చుకుని వీధిబళ్లోకి వెళ్లేవాడు. కాని, మాకు మరీ దగ్గిరవాళ్లల్లో కొందరు ఇంగ్లీషులు వెలిగించడం ప్రారంభించారు. వాళ్లమీద పోటీకొద్దీ, వాళ్లు కాస్త పక్కబెదురుగా ఉంటూండడానికి, మావాణ్ణీ ఇంగ్లీషులో పడేశాం. ఇంగ్లీషు అనడంతోటే డబ్బుఖర్చు. ఖర్చు లేకుండా రాజవిద్య ఊరికే ఎల్లా అబ్బుతుంది చెప్పండి? అక్కడికీ, మావాడికి దులాబీఖర్చు లేదు. పైగా, మావాడు అయినకాడికి ప్రతీక్లాసులోనూ రెడ్డికం వేసుగుని కదలకుండా కూర్చుని, ఇల్లంతా ఓకడికి తీసుకురాలేదు, వాడిధర్మమా అని. నే చెబితే గర్వంలా కనిపిస్తుంది—మావాడు అతిచురుకు, ఏకసంతగ్రాహి. తోటివాళ్లు చాలామంది ఏక్లాసులో బడితే ఆక్లాసులో మకాం వేస్తూండడం, మావాడు ఎక్కడా మచ్చటకేనా ఫేలవకుండా, చడీచప్పుడూ లేకుండా ఇట్టే దాటుతూండడం. అంచేత మావాడికి అన్నీ మెప్పులే, అన్నీ బహుమతీలే. వాడికి చదువుపిడుగు, పరీక్షపహిల్మాన్ అనేబిరుదులుకూడా ఉండేవి, కుర్రతనంనించీ. మరి పైక్లాసు చదివిత్తామా మాన్దామా అని ఒక్కొక్క పెద్దమెట్టుదగ్గిర మేం లోపాయికారీగా ఆలోచిస్తూ ఉండేవాళ్లం. ఆలోచన ఎందుకంటే, తరవాత తరవాత దేవుడు రక్షించి మావాడు చెయ్యగలఉద్యోగాల్లో, ఆర్జించగలసొమ్ములో ఖర్చులన్నీ పోగా మిగలగల డబ్బువల్ల, చదువు కెట్టుబడిసొమ్ముకి వడ్డీ డబ్బులేనా కిడతాయా కిట్టవా అనేసందేహంచొప్పున. మరి లోపాయికారీగా ఎందుకంటే, డబ్బు ఖర్చుకి మేం సందేహిస్తున్నాం అని వెల్లడిఅయితే, మా పరపతి సన్నగిల్లుతుందేమో అనే భయంచొప్పున. ఇంతలో ఎవరో పెద్దమనిషి చక్కా వచ్చి, నాతో ఈమాటచెప్పి ఆమాట చెప్పి, "ఇంకా చూస్తావేమిటయ్యా, బలరామయ్యా! మీరు జమీందార్లు. మీవాడు సీమపచ్చిమిరపకాయంటివాడు, చూపిస్తే అందుకుపోతాడు. వాణ్ణి చదువు మానిపించేరు గనక! నీరకం నారకం అయితే నేను మానిపించమనే పట్టుకుదును. ఓముక్క వచ్చేవాడికి చెప్పించకపోతే, త్వాష్టానికిటయ్యా చెప్పించడం! చాల్చాల్లే. ఎవడేనా వింటే నవ్విపోతాడు. తక్షణం పట్టం పంపించెయ్, శంఖంలో పోస్తేగాని తీర్థం కాదు." అని నన్ను కోప్పడుతూండడం, దాంతోటి నేను పొంగిపోయి, పైకిమాత్రం చప్పరిస్తూ, ఏత్రలో తాకట్టెట్టి మావాణ్ణి పైక్లాసుకి పంపిస్తూండడం. ఇల్లాగ్గా జరుగుతొచ్చేది. మెట్టుమాట మావాడు చదువులో సరసరా జువ్వలాగ పైకి లేచి, ఇంగ్లీషులో బాఘా తడిసి, నాని, ఊరి ఊరుకున్నాడు. మాలో వీడి కొక్కడికే ఇంగ్లీషు రావడంవల్ల, వీణ్ణి మేం "ఇంగ్లీషుతమ్ముడు" అని వాడుతూంటాం.

మరి ప్రస్తుతం. మావాడితో కలిసి చదువుతూ చిన్నక్లాసులోనే ఫేలిపోయి మానేసిన వాళ్లపని, ఇప్పుడు, మూడుపువ్వులూఆరుకాయలూ గాఉంది. అబ్బే, మరోచమత్కారం! వాళ్లల్లోనూ ఎంత చిన్నక్లాసులో ఫేలైతే ఎంత పెంద్రాళే ఇంగ్లీషుమానేసినవాడై ఉంటే, అంతపనికొచ్చేవాడూ, అంత సంపాదనపరుడూ అయిపోయాడు. మావాడో! చదువుకునేటప్పుడు వీడిపని ఎంత ప్రభగా ఉండేదో ఇప్పుడు అంత నస్మరంతిగా ఉంది. వీడికి ఉద్యోగం ఇస్తాననే జ్ఞాని ఎవడూ కనపడ్డు. ఎక్కడేనా ఉద్యోగం ఖాళీగా ఉందని తెలిసి ప్రయత్నించడానికి వెడితే (అనుకుంటే తప్పు, ఇల్లా వెళ్లడానికి బోలెడైంది!) ప్రతీఅధికారీ మావాడితో "నువ్వు ఏంపని చెయ్యగలవ్?" అంటాడట గాని, "నువ్వు ఎంత పెద్దపరీక్ష ప్యాసయి సావ్?" అని అడగనే అడగట్టు!! ఏమైతేం, వీడికి ఒక్కదమ్మిడీ ఇంటో పడేద్దామనే ఊహ లేదు, పడెయ్య

గల ప్రజ్ఞ లేదు. తనూ, పెళ్లాం (ఆవిడదగ్గర మేం అసలు మాట్లాడలేం!) ఇద్దరు కూతుళ్లూ (వీళ్లకి ఎప్పుడూ ఒళ్లు సనిగా ఉండదు)—వీళ్లంతా ఉమ్మడి సంసారంలోనే. అంచేత మావాడికి ఊహూ మొహమాటం. అసలు వాడికి నోట్లో నాలిక లేదు. పైగా వాడికంతా అతిసుకుమారం. పైమీద కండువా కూడా బరువే. ఓగజం నడవ లేడు—కారో, విమానమో కట్టిస్తాడు. ప్రతీదీ దర్జాగా ఉండాలంటాడు. సొమ్ము రావలిసినచోట దాక్షిణ్యం అంటాడు, ఇవ్వవలిసినచోట తూర్పుమొహంగా తిరిగి దణ్ణం పెట్టి ఇచ్చెయ్యమంటాడు. వీడు చదివింది ఏమిటో మాకు తెలియదు, ప్రపంచానికి అక్కర్లేదు, (వాడేం జేశాడు, మేమే చదివించాం లెండి!). దైవచింత ఉందేమో అంటే, దేవుడూ నై గురూ నై అంటాడు; పైగా మన దేవుళ్లు మనకంటే బొత్తిగా అన్యాయం అంటాడు. సరి, మతం చూద్దామంటే వాడిమతం నాకమతం ఒక్కమోస్తరుగానే ఉన్నాయి. పోనీ మనిషైనా రాయల్లా ఉన్నాడేమో అంటే, అబ్బే, ఆకోటు తొడిగినంతసేపే గాని, విప్పేస్తే మనిషికి వంట్లో పంపుమాంసం లేదు. అడ్డిగెత్తు నెత్తురు లేదు. వొట్టి ఎముకలపోగు. ఎవడేనా తనికి అన్యాయం చేస్తే, వాణ్ణి కాస్త శకాయించడం అంటూ లేదు—వాడిపాపాన్ని వాడే పోతాడంటాడు, లేకపోతే ఇంట్లోవాళ్లమీదా నామీదా కోప్పడతాడు, లేకపోతే తనగదితలుపు రాయల్లా పెద్దగడియ వేసుకుని ఒక్కడూ కూర్చుని అవతలవాణ్ణి తిడతాడు. ఎవళ్లేనా బంధువులు తటస్థించినప్పుడు వాళ్లతో—ఉన్నసంగతే ఆయిరి, లేకపోతే లేనిసంగతాయిరి—ఏదో వొకటి యథాశక్తి ఆప్యాయం కనపరుస్తూ కలిమిడిగా మాట్లాడ్డం మావాడు ఎరగడు. ఎక్కడేనా రక్తస్పర్శ ఉన్నవాళ్లల్లో ఎదేనా కష్టం వచ్చినప్పుడు వాళ్లని కాస్తపరామర్శ చెయ్యకపోతే బాగుండదని వీడికి తెలియదు, ఆవిధానం అసలు తెలియదు. తన సంసారాన్ని అత్తారింటిదగ్గిర్నించి తీసి తెచ్చుగోడం తనకి సిగ్గుట, ఇంకోర్ని వెళ్లి తీసుకురమ్మంటాడు; ఏమనుకుంటారూ! శిస్తువసూలుకోసం పొలాలమీదికి వెళ్లి రారా అంటే, అక్కడ ఏమీ తోచదంటాడు. మొన్న మట్టుకి మెడట్టుగు గెంటగా వెళ్లి, వసూలుసొమ్ము పాదరుఖర్చుకి చాలక, నోటు రాసుకుని ఇంటికొచ్చాడు. పోనీ, అయ్యా, ఎప్పుడేనా తేలొస్తే ఎవడేనా పైజా రుచ్చుకుని పచ్చడికింద కొట్టడూ? మా తమ్ముడేం జేశాడూ! "తేలు ఎంత మంచి దనుకున్నారు! దోషం అంతా దాని కొండీది. కొండీ పట్టేస్తే, అది ఎంతో సాధువై పోతుంది. నేను పట్టుకుంటున్నా, చూడండి!" అని రెండువేళ్లతో పట్టాలని యత్నించాడు నేర్పుగా. కాని, దానికుండమొయ్యా, తేలు, అంత కంటె ఎక్కువ నేర్పుగా ఒక్కదెబ్బని రెండువేళ్లమీదా కూడా కుట్టింది. ఇక, పాము అంటే అసలే ఆశ లేదు. మాతమ్ముడికి రాత్రెళ్లు చీకట్లో వెళ్లడం భయం. ఏమిరా అంటే, "పురుగూ బుట్రా ఉంటాయేమో అని బెదురుగాని దొంగభయం చిన్నప్పణ్ణించీ లేదు." అంటాడు. దొంగ లంటే జ్ఞాపకం వచ్చింది. మొన్న ఈమధ్య ఒక ముసిలాయన ఇంట్లో దొంగ లడ్డారు ఆయన జీవితం అంతా మాటలు చెబుతూనే ఉన్నవాడైనా, దొంగాణ్ణి పట్టడంలో—ఎల్లా గనుకున్నారు మళ్లీ—భల్లూకప్పట్టు పట్టేశాడు. తరువాత వారానికి మాయింటికీ దొంగ లొచ్చారు. అప్పుడు మాతమ్ముడు మెలుకువగానే ఉండి, మొహంమీదికి కూడా శాలువ లాగి కప్పుకుని పడుకున్నాడు గాని, వాళ్లు ఒక్కవరసని ఇల్లంతా వీధులో పెడుతూంటే కేకలేనా వెయ్యలేదు. ఏమిరా అని మొన్నాడు కనుక్కుంటే, కేకలేస్తే తనికి నామర్దాట. పైగా, తను అప్పుడు మెలుకువగా ఉన్నాడో, నిద్దరలో ఉన్నాడో అది ఓ పెద్ద స్వప్నసమస్యట, ఆ అవస్థగురించి ముందుముందు పుస్తకం రాస్తానన్నాడు. పోనీ, తనుసొమ్ము లేకపోతే పీడాపోయిరి, నేను ఎవో మాసిగ్గలుపడి తెచ్చిన డబ్బెట్టి బజార్లోంచి ఏమన్నా వస్తువులు తేరా అంటే, టైం లేదంటాడు. ఒక్కొక్కప్పుడు ఇంట్లో పోరు పడలేక బజారికి వెడతాడా, ఆఖరికి కూరలు తేవడమేనా తెలియదు. తక్కెడకి దాళా ఉంటుందని మావాడు ఎరగడు. కొనుక్కునే వస్తువులు మంచివో కావో ఎరగడు, వంకాయకి ముచిగ దళసరిగా ఉండాలనీ, ములక్కాడ మెలితిప్పితే తిరగాలనీ, వెలక్కాయలు డీడిక్కీలు కొట్టి చూసుగోవాలనీ,

బెండకాయ చివర విరుగుడుపడాలనీ, ఆనపకాయ గోరు దిగేటట్టు ఉండాలనీ, వగైరాలు మావాడికి బొత్తిగా తెలియవు. అట్టె వెళ్లడం. వెళ్లి, దుకాణదార్ని 'ఈ సరుకు మంచిదేటయ్యా?' అనడం. అంటే అతడు 'బంగారం అండి. ఫస్టు. మాన్యమైన సరుకండి.' అంటాడు. లేకపోతే, అమ్మకో దల్చినవాడు తన సరుకు చవటచెత్త అంటాడా, చెప్పండి! దాంతోటి, మావాడు, "అయితే, ధర పిసలేనా?" అంటాడు. అంతే గాని, వీశెంత, శేరెంత, తులం ఎంత అని అడగడు. ఎందుచేతో తెలుసునా? ఏవస్తువు ఏ లెక్కని ఉంటుందో ఎరగడు. ఓమాటు కస్తూరికని వెళ్లి, 'వీశెంత?' అని అడిగాట్ట. అది మొసలుచేసుకుని, ఉమ్మడి ప్రశ్నలు నేర్చుకున్నాడు. దుకాణదారు, "అయ్యా! మాదగ్గిర రొండు మాటల్లేవు. వాకబు చెయ్యండి. తేడా వస్తే రెట్టింపు ముదరా యిస్తాను" అంటాడు. అంటే మా వాడు, "అయ్యా బేరం చెయ్యడం నాకు అసహ్యం. ధర విషయమా! మీ యిష్టం వచ్చినట్టు పుచ్చుగోండి. ఓడబ్బు అయినా సరే. మనికి ఆ లక్ష్యం లేదు. సరుకు మంచిది కావాలి. త్వరగా యిప్పించండి, నాకు టైం లేదు" అంటాడు. అంత ముళ్లమీద నుంచుంటే బేరాలు ఎల్లా కుదురుతాయి! ఆపళంగా ఏవో తెచ్చి ఇంట్లో వేస్తాడు. అక్కణ్ణించి, స్నేహితుల్లో జేరి పేకాట, లేకపోతే, వాడిల్లాంటి వాడు, వీడిల్లాంటివాడంటూ ఊళ్లోవాళ్ల మీద యాగీ. ఇంతోటి శ్రమకీ మధ్యమధ్య ఫలహారం. ఓనాడు సీతాఫలాలు ఇంటికమ్మొస్తే, మావాడే బేరంజేశాడు. అమ్మే ఆమె అర్ధణాకి అయిదు చెప్పింది. మావాడు, "నాకు అయిదక్కర్లేదు. నాలుగే చాలు. ఏరితీసుకుంటాను మంచివి" అన్నాడు. అసలు మంచివి ఏరితీసుకునే పద్ధతినే అయిదని దాని ఉద్దేశం. ఏం చెప్పనూ! ఇవన్నీ అల్లా ఉంచండి. పోనీ, ఇంత కొట్టుకుని తినేరకం కాకూడదా! సమస్తం ఇంట్లో ఉంటాయిగా! తనకేమన్నా లోటు రానిస్తామా? పొద్దస్తమానం తెగ చిరితిండి. చిరితిండి వాళ్లకి అసలు తిండి మోటు. అయినా సరే, భోజనంవేళ అయేసరికి, గంటల ప్రకారం, విస్తట్లో అన్నం పడాలంటాడు. కడంవి ఎల్లానూ గంటల ప్రకారం జరుపుగోలేం, భోజనమైనా జరపాలని మావాడిపట్టుదల. ప్రతీరోజూ ఇంట్లో, రూల్సుప్రకారం ఎల్లా దేవుళ్లాడుతుంది, చెప్పండి! తిండి తిండని ఇంత బులబాటమే గాని, తీరా విస్తరిదగ్గిరికి, వచ్చేసరికి ఒక్కవాయేనా కలుపుగోకుండా, మెతుకులూ, కోడిచిమ్మినట్టు చిమ్మి, విస్తరంతా కళ్లంఅల్లా చేసి చక్కాపోతాడు. అంచేత, "నాయనా, సంపాదనా వద్దు, సమారాధనావద్దు, నువ్వు అనుకుంటూన్న ఆత్మగౌరవం చెడగొట్టుగోకు, లోకవ్యవహారం నేర్చుగోకు, పోనీ ఇంత భోజనం చెయ్యడమేనా నేర్చుకోరా. వంటికి మంచిది. 'శరీరమాద్యం'రా." అని అనేకకాలం నించి మాతమ్ముడుకి నూరిపోస్తున్నాను. ఏమని నూరిపోశావూ అని అడగరేం? మనవిచేస్తూన్నా! వెనక, మా ప్రెసిడెంటుగారు నాకు నూరిపోసిన ప్రకారమే. వారు ప్రతీ పెళ్లివిందుకీ వెళ్లేవారు. మాఘమి అడ్డొచ్చి కొన్ని పెళ్లిళ్లూ, తద్వారా విందులూ ఆగిపోవడం నించి వారాగ్రహించి మాఘమి అనగా మూఢులు పెట్టిన శూన్య భోజన నియమం అనేవారు. శారదచట్టంవల్ల పెళ్లి విందులు అసలే మూలబడిపోయిన ఈ సంవత్సరం క్రితం వరకూ వారు సాలుకి యాభై అరవై విందులకేనా వెళ్లేవారు. వారు ఒకచోట కొంతకాలం సూపాధ్యక్షులుగా ఉండి పిదప స్వయంకృషిచేత అఖిల ప్రపంచ భోజన మహామండలికి గౌరవాధ్యక్షులు అయారు. విశేషించి, భోజనానికి పడగెత్తారు. వారి పతాకానికి చిహ్నాలు— పీట, ఆకు, రాగిచెంబు, మాషచక్రం. ఈ క్రిందిమోస్తరుగా వారు సెలవిచ్చేవారు.:

"విందులకి తప్పకుండా వెళుతూండు, దాటపెట్టకు. భోజనం పెడతానన్నప్పుడు తినకపోతే, మళ్లీ అప్పట్లో దొరకదు. అన్నింటికీ తయారీ అవసరం. విందుకి మరీ అవసరం. టిక్కట్లవిందుకి తెగ అవసరం. విందుసంగతి రెండుమూడు రోజుల పూర్వం తెలిస్తే, చూచాయగా తెలిస్తే చాలు, హారం తగ్గించుగో, లేక భేది స్వీకరించు. మరీ శ్రోత్రియుల పక్కని కూచోవలిసొచ్చి, అధాత్తుగా మడిగట్టుకోడం అవసరం అయితే, చొక్కా తీసేసి, బిళ్ల గోచీ పెట్టి, పైమీద పంచ సన్నంగా మడతెట్టి, ఎత్తెత్తి అడుగువేస్తూ, జనాన్ని తప్పుగోమను. అగ్రం ఉన్న ఆకు

చూసుకుని, ఈనె తీసెయ్! ప్రారంభించడానికి పూర్వం తెల్లబోయి మాట్లాడుతూ కూచుని సైంపాడు చేసుకోక, అంటులేని మిఠాయి వగైరాలు రుచిచూచి, పేచీవస్తే, వడ్డించలేదను. జలపదార్థానికి కూడా స్థలాక్రమణరోగం ఉంది గనుక, భోజనం పూర్తికాందే, ఉదకం తాగకు. తరువాత ఎక్కడేనా ఇంకోరింటో కాబోయే విందు చూపు మేరలో ఉంటే తప్ప, పప్పు 'డబుల్ డోస్' చెయ్యి. కొండొకచో మాగాయి టెంక వడ్డించినట్టయితే, వెంటనే మజ్జిగ తెప్పించి అందులో అది ప్రప్రథమాన్నే నానెయ్. ఆవడలు వడ్డించేటప్పుడు దిక్కులు చూస్తూ కూచోక అవి దధిసమేతంగా పడ్డాయో లేదో, సరిగా పడ్డాయో లేదో గమనించు."

అంటే మాతమ్ముడు, "సరిగా పడ్డం వేమిటి? నాకు తెలియనట్టు చెబుతావేం అన్నయ్యా!" అన్నాడు. ౪

"సరిగా అంటే సరిసంఖ్యలో, అనగా, రెండు, నాలుగు, ఆరు ఇల్లాపడవలసినవే గాని అవి, బేసిగా దిగ కూడదు. అవి కొంతవరకు ముచ్చటించి, వడ్డించేవార్ని దగ్గిరికి పిల్చి, చెవులో చెప్పు, ' "పూర్వాశ్రమం" తెప్పించండి' అని. "పూర్వాశ్రమం అంటే ఏమిటన్నయా!" అన్నాడు మావాడు. "ఎంత సత్తెకాలంరా నీది. పూర్వాశ్రమం అంటే కారపుగారె. ఇంకా పెరుగులో పడకప్పుడు అదేగా మరి దాని జన్మ! అవి అందిన వెంటనే మరోమా వడ్డించేవాణ్ణి పిల్చి (మొదటివాడే అయితే దిష్టి తగలవచ్చు) "నిజస్వరూపం" పట్రమ్మను. అది కారంలేని అసలుగారె. క్షీరాన్నం పట్రాగానే ఎన్నడూ వడ్డించు గోకు. తెచ్చిన గోకర్ణం లోది చాలా భాగం అయి పోయిన తరువాత, మిగిలిపోయినమడ్డి నీ విస్తట్లో బోర్లించమను; అప్పుడే నీకు జీడిపప్పు వగైరా గంభీర సామగ్రి దక్కుతుంది."

మావాడు—ఒకవేళ పైవి అవేళ చెయ్యకపోతే.

నేను—ఏదో ఓటి చెయ్యక మాన్రు. లడ్డూలు చేస్తారనుకో. ఎంజేస్తావు?

మావాడు—అమాంతంగా తినెయ్యడమే.

నే—ఏడిసినట్టే ఉంది. అవి ముందు నేతివో నూనెవో పోల్చాలి. అందు నిమిత్తం, అవి చిదిపి వాటిల్లో నెయ్యి వడ్డించుకో. ఆమిఠాయి నేతిదా, నేతి మీద నెయ్యిమంచిది, నేగి లేదు. కాక అది నూనెదా, నెయ్యి కలిసింది గనక వాసన కొడుతుంది, విసర్జించు.

మావాడు—నాకు అట్టే సయించదన్నయ్యా?

నే—రీతి తెలియనప్పుడు వినోరీ!

"ఏదైనా తీపిసరుకు ప్రత్యేకంగా తినడం పాపం. అది ఎప్పుడూ పకోడీలాంటి కారపుసరుకుతో చెరి సహోయిస్యాహో లాగ లాగవలిసిందే."

మావాడు—ఎమో! కారమే ఎక్కువ తినాలని నాఉద్దేశం!

నేను—"నీ ఉద్దేశం ఎవడి క్కావాలిరా, ఇందు లో ప్రవేశమేనా లేనివాడివి! కృష్ణుడి ఉద్దేశంరా అదీ! సుఖం అనగా, తీపేనా? దుఃఖం అంటే కళ్ళమ్మట నీళ్లు గనక, కారమేనా? అయితే విను. సుఖదుఃఖే అనగా తీపికారాలు రొండున్నూ అనగా లడ్డూ పకోడీలు రొండున్నూ, సమే కృత్వా అనగా రొండు సమరాసు లుగా ఇదెంతో అదంత చొప్పున చేసి, లాభాలాభౌ అనగా లడ్డూలలో ద్రాక్షలు గాని పకోడీలలో ఉల్లి పాయలు గాని లభించినా లభించకపోయినా, జయాజయౌ నీకు చాలా సయించినా సయించకపోయినా చలించక ఏకగుణంతో ఉండి, తతః తరువాత, యుద్ధాయ అనగా లడ్డూపకోడీ లడాయికి, యుజ్యస్వ అనగా తయారు కావోయ్ అబ్బాయీ! నైవం పాపం అవాప్స్యసి అనగా ఇల్లా చేస్తే నిన్ను చీమంతైనా పాపంటుకోదు—అని."

మాతమ్ముడు—నాకు చాలా చాలా వడ్డించు మని అడగడం సిగ్గు అన్నయ్యా!

నేను—అప్పుడు నవ్వు వడ్డించే ఆయనతో, "ఇల్లా ఒక్కరవ్వ విదపండి" అని విస్తట్లో వేలు పెట్టి చూపించి, వేలు అల్లానే ఉంచి, ఒరిగి పక్కపంక్తిలో ఉన్న ఎల్లయ్యగారితో రాచకార్యం ఉన్నట్టు పెద్ద వాక్యం మాట్లాడుతూండు. కావలిసినంతా పడ్డవయినం

కీగంట గమనించి, అప్పుడు నువ్వు సరిగ్గా తిరిగి వడ్డించే వాడిమీద తమాషాగా ఖస్సుమను. వడ్డన ఆలస్యం ఎప్పుడేనా అయితే, ధప్పళం ముక్కలు పరామర్శించు. అందుకనే అవి పెద్దసైజులో ఉండడం. వీలైనప్పుడల్లా "రెడ్ విత్" చేస్తూండు—అనగా మిశ్రమం. ఒకవేళ పచ్చిమిరపకాయ తెప్పించి ఉప్పులో అద్ది పప్పులో కొరకచ్చు. ఆపనినే పప్పులో పచ్చిమిరప 'రెడ్ విత్' సాల్ట్‌యాక్టు అంటారు. అల్లానే పప్పు రెడ్ విత్ ధప్పళం! మా ప్రెసిడెంటుగారు ఇల్లాంటి నూతన దాంపత్యాలు అనేకం కనిపెట్టి ప్రపంచానికి కళ్లు తెరుస్తూంటారు. జిలేబీ విశేషంగా తినేటందుకు వీలుఏర్పడడానికి వారు జిలేబీ-రెడ్ విత్-మజ్జిగపుల్స్! అనేది స్వానుభవంమీద కనిపెట్టారు. అన్నట్టు మరిచిపోయాను. చేతికి చాలాజిడ్డు పట్టుకుంటే వీలునుబట్టి కాళ్లకో గడ్డానికో పట్టించు."

ఈరీతిగా, పెద్దలమాల్ల విని, మావాడికి భోజనోపదేశం చేస్తున్నాను. ఉపదేశం ఆచరణలోకి రావడం మాటలే! దేశం ఆచరణలోకి వస్తే, ఉపదేశమూ వస్తుంది.

౨. (.........)

3. సంగతులు.

(౧) ఒకానొక జైలులో ఉన్న ఒక మగఖైదీని చూడడానికి అనుజ్ఞ కోరుతూ, ఆఖైదీపెళ్లాం దరఖాస్తు చేసింది. అనుజ్ఞ కాలేదు. కొన్నాళ్లకి ఆఖైదీయొక్క స్నేహితుడు ఒకాయన ఖైదీని చూడడానికి దరఖాస్తు చేశాడు, అనుజ్ఞ ఇచ్చారు, చూశాడు. మళ్లీ కొన్నాళ్లకి ఆఖైదీభార్య చూడడానికి అనుజ్ఞకోసం దరఖాస్తు చేసింది. అనుజ్ఞ ఇచ్చారు కారు. మన్లోమనమాట, రెండోసారి వెళ్లి చూసినమొగాడు, ఆవిడేట! వేషం! పగలుట!

(౨) 'బొంబాయిలో పగటి చుక్క కనపడిందిట. అది అసలుచుక్కే. తెల్లారకట్ల వచ్చేచుక్కని చాలామంది ఎరగరు. వాళ్లు అసలు తెల్లారకట్ల అనేది చూడరు. ఆచుక్క కాంతికి నీడ ఉంటుంది. అది సాలుకి రెండునెల్లపైచిలుకు అల్లా పొడుస్తుంది. ఆకాలంలో అది సూర్యోదయం తర్వాతగుడా కనిపిస్తుంది. ఈవేళ ౧౦ గంటలకి నే చూశాను.' అని మా విలేఖరి వ్రాశాడు. పగటిచుక్కకి ఇంతపట్టింపు ఎందుకన్నాడు ఒకద్రావక ప్రియుడు.

(3) 'లాటీ' అనే జంతువుయొక్క జననాభివృద్ధి క్రమాలగురించి రిసర్చ్‌చేసి పర్యవసానం తేల్చడానికి ఒకచోట ఒకకమిటీ పెట్టారు. ఆకమిటీవారికి పొసగక వారు రెండింటికింద చీలిపోయారు. ఒకరు ఇంగ్లీషునా ఒకరు తెలుగునా ఆలోచించారు. ఇంగ్లీషు ఆలోచనపరులు అన్నదేమిటంటే,

"లాటీ అనే దాన్లో ఉండుకున్న వస్తుతత్వం కర్ర—అనగా ఇంగ్లీషులో 'వుడ్'. ఈ 'వుడ్' ఉన్న ప్రదేశమే లాటీయొక్క జన్మస్థలం. ఈ 'వుడ్' ఎక్కడెక్కడ ఉందంటే—వెడ్జ్‌వుడ్ బెన్న అనే పేరుగల ఇండియామంత్రిలోనూ, H. E. ఎడ్వర్డు ఫ్రిడరిక్ లిండ్లేవుడ్ అనే స్వంతపేరుగల రాజప్రతినిధిలోనూ, H. E. బర్డువుడ్ అనే పేరుగల్గి వెళ్లిపోయిన ప్రధాన సేనానిలోనూ, ఉంది. ఆమాటకొస్తే, H. E. చెట్‌వోడ్ అనే పేరుగల ప్రస్తుత ప్రధాన సేనాని పేరులో కూడా చాలాభాగం ఉంది.

ఇక తెలుగు కమిటీవారిలో కొందరు చెప్పిందేమిటంటే, ఆలా ఈలా కాకుండా సిసలైన తెలుగు "లా" అనేదానికి "టీ" పార్టీపదమైనప్పుడు, ప్రయోగరీత్యా 'లాటీ' సిద్ధిస్తుంది—అని.

మరికొందరు అది అసలు 'లాతీ' గాని 'లాటీ' కాదన్నారు. అనగా లా=లాఅనేది, తీ=తీశెయ్ అని. అంటే నీ లా తీశెయ్, నా లా తీస్కో—అని అన్వయించారు.

(౪) ఒకమునిసిపాలిటీలో ఉండే చాలానూతుల్లో మూడు నాలుగుమాత్రమే అదృష్టంకొద్దీ బాగుపడ్డాయి. ఎందుచేతంటే, వాటిల్లో మనుష్యులు పడి చచ్చిపోడం మూలాన్ని నీళ్లు తోడించేసి, బురదా, మరి లోగడ పడిపోయినవాళ్ల ఎముకలూ వగైరాలు పైకి లాగించెయ్యడం చేత. తక్కిన వాటిల్లోగూడా ఎప్పుడు మనుష్యులు పడుదురా, ఎప్పుడు అవి బాగు చెయించి పుణ్యం కట్టుకుందామా అని మునిసిపాలిటీవారు శక్తివంచన లేకుండా

నిరీక్షిస్తున్నారు. పురుషుల్ని తీసెయ్యండి, స్త్రీలైనా నడుం కట్టి ముందుకి అంగ వెయ్యరా అని వారి ఆశ.

(౪) ఓ పట్టాన్ని ఏ ఉద్యోగమూ కాని ఈ కైములో, చాలామందికి, అయాచితగా, వర్ణ వివక్షతలు లేకుండా, ఆశ్రయింపులూ, సిఫారసులూ, లంచాలూ లేకుండా అవడం గొప్ప శుభసూచన. ఏవీ అంటే, మన సెన్సస్ ఉద్యోగాలు. కొందరు, ఇంగ్లీషు తిన్నగా రాకపోయినా, 'జనాభా లెక్కలు' అని వాడితే తేలికగా ఉంటుందని, ఏ తప్పుడుగానో ఇంగ్లీషే వాడుతూంటారు. 'మీకు సెన్సెస్ ఉన్నాయిటండీ?' అని కొందర్ని అడుగుతూంటే అవతలవారు 'లేవండీ' అంటూండడం విని పిస్తూంటుంది.

(౫) ఆర్. టి. సి. (R. T. C.)యొక్క (అనగా రాజమండ్రీ ట్రైనింగు కాలేజీ కాదు, రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సు) ధోరణి చూస్తే అది మంచి రసకందాయ పట్టులోనే జరిగింది. ఆరసంయొక్క వయినం:— అక్కడికి స్త్రీలనికూడా పిలవడం, అదొక శృంగారం. ఒకళ్లు వెడతారనుకున్నది మరొకళ్లు వెళ్లడం హాస్యం. ఒక అఖండుడు మరణించడం కరుణం. ఇండియాకి ఇంకా ఏమిచ్చారో తెలియకుండానే, అంతా ఇచ్చేసేవా అని మేక్డొనాల్డు గారికి చర్చిల్ కంపెనీవారు కోప్పడడం, రౌద్రం. ఇంగ్లండులో లెప్టు వింగు లేబరైట్లు చేస్తూన్న ప్రయత్నం వీరరసం. ఆ సమయంలోనే, కర్మనశాత్రు కొందరు తీసుకుంటూన్న చర్యలు భయానకం. ప్రజల్లో కొందరిస్థితి బీభత్సం. సైమన్ జట్టు వారి పంచాంగం మూలపడేశాం అని పైకి అని, అందులో చెప్పిన ప్రకారమే క్రియలు జరపడం, అద్భుతం. జనకనించీ ఇండియాలో కోరుతూన్నదీ, ప్రస్తుతం ఇంగ్లండునించి వారు కోరుతూన్నదీ శాంతం.

(౬) ఓ పెద్దమనిషి ఓ అబ్బాయికి ఓ పెళ్లి సంబంధం తప్పించెయ్యాలని బయలుదేరి, వాణ్ణి నిరసిస్తూ, పిల్ల నివ్వదల్చిన ఆయనదగ్గిర ఇల్లా అన్నాడట:—

అయ్యా! మీరు పిల్ల నివ్వదల్చిన వాడికి 'మీరా మాలా బులా' అనేపాటకుడా రాదు. వాడు గమోపా ఖ్యానం ఎరగడు. వాడు తెలుగు క్లాసులోకుడా అల్లరి చెయ్యలేదు. వాడు ముందు ముందుకి మేష్టరీ ట్రైనింగుకేనా పనికిరాడు. అతణ్ణి రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సుకేనా పంపడానికి వీల్లేదు, చివరికి.

(౭) ప్రస్తుతం ట్రేడ్ డిప్రెషన్‌లో ఉన్నాం, అనగా వర్తకమాంద్యం, అంటే డబ్బుకాటకం. దేనికైనా సరే సమాధానాలు చెప్పి పారెయ్యడానికి ఇది ఓ పెద్దకారణంకింద ఏర్పడింది. ఈమధ్య ఓ కుర్రాణ్ణి "ఏం అబ్బాయి, లేట్‌గా వచ్చావేం?" అని మేష్టరు అడిగితే, "ఏం లేదండి. ట్రేడ్ డిప్రెషన్‌గదా!" అన్నాట్ట. మేష్టరు "అప్రస్తుతంగా మాట్లాడక సరియైన సమాధానం చెప్పు!" అన్నాడట. అంటే కుర్రాడు, "నిజమేనండీ, సార్! ఇదివరకు చేతులో డబ్బాడుతూంటే జట్కామీద వచ్చే వాణ్ణి, ఈ వేళ నడిచి వచ్చాను, లేటయింది" అన్నాట్ట. తనరాబడిని బట్టిచూసి, "డబ్బు కాటకంవల్ల, రోగాలు తగ్గిపోయినాయి" అన్నాడు ఓ డాక్టరు. "రోగాల సంఖ్య తగ్గలేదూ! డబ్బుకాటకంవల్ల రోగాలు ఇంటిదగ్గిరే కుదిరిపోతున్నాయి" అని వారి స్నేహితు డన్నాడు. దీనికి కారణం, పదణాలవెండి మాత్రమే గల మన రూపాయే అని కొంద రంటారు. కొందరు, అసలు ఈ తెగులు ప్రపంచానికే వచ్చింది, ఇండియాకిమాత్రమే కా దన్నారు. కొందరికి ఈ సంగతి ఇల్లా వస్తుందని అయిదేళ్ల కిందటే తెలుసుట, మనతో చెప్పారట, మనం వినిపించుకో లేదు. ఏమైతేం? వస్తువు ఉన్నవాడినెత్తో వట్టి. ఈ మధ్య ఓ ఆయన క్షౌరం చెయించుకుని మంగలాడికి పదహారు కొబ్బరి కాయలు ఇచ్చాడు. ఋణదాతలు ఋణస్థుల్ని నిక్కచ్చి చేస్తున్నారు. అంచేత ప్రస్తుతం అన్నీ చవక అయినట్టే, దివాలాలుకూడా చవక అయినాయి. ఇదివరలో కొన్నేసి వేలకే దివాలాలు గాని, ఇప్పుడు కొన్నికొన్ని వందలకే. టంకసాలల్లో రూపాయిలు కొట్టించి దేశంమీద చిమ్మిస్తే డబ్బుజబ్బు కుదురుతుంది అని ఒకాయన అన్నాడు. కొందరు, చూస్తూంటే సరి, ధరలు వాటంతట అవే పెరుగుతాయి అన్నారు. అని "ధర తగ్గుట హెచ్చు కొరకే" అనేది ప్రమాణంగా ఇచ్చారు.

(౯) ఆంధ్రా యూనివర్సిటీ స్థలనిర్ణయం రెండింటితో బయల్దేరి, మూడు మించి నాలుగులోకి వెళ్ళింది. నాయకత్వానికి పోటీ ఇద్దరితో మాత్రమే బయల్దేరింది. ఇదికూడా ముగ్గుర్లోకీ వెళ్ళిందా, నలుగుర్లోనూ పడిందన్న మాటే!

(౧౦) ఒక పల్లెటూరిశాస్త్రుల్లుగారు, పట్నవాసపు చుట్టంతో మాట్లాడుతూ:—

శా—చూడండీ! శారదాభిల్లుడుగారు కులాసాగా ఉన్నట్టా.

చుట్టం—ఆ. ఏం?

శా—ఆయనది మహాగొప్ప ముందుచూపు.

చు—ఏం? ఎల్లా కనిపెట్టారు?

శా—ఆయన అప్పుడు శాసనం చేయించకపోతే, అన్ని పెళ్ళిళ్లు అప్పుడు జరిగి ఉండవు. అప్పుడు గనక జరిగి ఉండకపోతే, ఇప్పుడు, డబ్బుకాటకం మూలాన్ని ఆసలే జరక్కపోను.

చు—చిత్తం. ఏమిట సెలవు.

శా—ఆయన గట్టివాడే!

చు—తమరి అనుగ్రహం!

(౧౧) ఇండియాలో డబ్బు కాటకం గురించి ఆలోచించి, సలహా చెప్పడానికి "సాల్టరు" దొరగారు వచ్చారు. ఇంతమంది ఉండగా 'సాల్టరు'వారే ఎందుకు వచ్చారంటే: ప్రజల్లో తగాదా ప్రారంభం "సాల్టు"తో అయింది గనక ప్రభుత్వంవారు ఓ డిగ్రీ పైన ఉండడాని "సాల్టరు"గారిని పిలిపించారు.

(౧౨) షణ్ముఖం అనే ఆయునకి ఈమధ్య లాటీ దెబ్బలు తగిలాయిట. అతనిమీద పోలీసువారు అక్రమ సంఘం (అన్‌లాఫుల్ ఎస్సెంబ్లీ) నేరం మోపారట. అతడొక్కడే ఉన్నాడని పోలీసువారు కూడా ఒప్పుకున్నా, అతని పేరులో అయిదుకంటే ఎక్కువ ఉంది గనక అతనిమీద ఆకేసు పెట్ట వలిసొచ్చిందని సెలవిచ్చారట.

సెలవ్.

---

# లాస్యతృష్ణ

శ్రీ. శ్రీనివాసరావు గారు (కవితాసమితి)

కడలి కెరటాల శ్రుతిలోన కలిసి మెలసి
గగన గంధర్వ గానరాగములు మ్రోయ
తూర్పు దిక్కున పూర్ణిమా తుహినకరుడు
తరళధవళ విలాస నర్తనము తెరచె.

ఈ విశాల సమగ్ర వాతావరణము
కాంతి తంత్రీ సుధామృదు గానగీతు
లెగయు జగదీశ్వరాంఘ్రి మంజీర నటన
మటు లనంత లీలా నాట్య మభినయించె.

తారకలు లేని స్వచ్ఛ సౌందర్యబంధు
రాంబరాంగణ మొకి ధవళాంబరి వలె,
అమృత వారాశి వలెనె చరాచరముల
కిడెను తనదివ్యలాస్య సాహిత్యరుచులు.

ఇది జలధినాథు నెదలోన నిముడలేని
ఎదురు లేని మహా సౌఖ్యమేమొ—శీత
వీచికా మేదుర తుషార సేచనమున
ఆకసము నంటుకో ప్రాకులాడు నితడు.

ఉరలునా నా ఎడంద ఈ దారలు తరగ
లం దొక సుధాంశుకిరణమై, హర్ష గాన
కలకల శ్రావ్య నినదము లొలయుచున్, న
వీన ఫేనద్యుతులలోన లీనమగుచు.